క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

మందమర్రిరూరల్: పరిసరాల పరిశుభ్రత తోనే మంచి ఆరోగ్యం సమకూరుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలని, వృథా వస్తువుల్లో నీటి నిలువలు ఉంచొద్దన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, సిబ్బంది ఉన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

జన్నారం: కొత్తగా పట్టదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో సంగీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టదారు పాసు పుస్తకం లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన డీఎస్ పేపరు, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, జిరాక్సులు జత చేయాలన్నారు. 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన వారు రైతుబీమాకు అర్హులని తెలిపారు. ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీలాపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ కల్వల శరత్ మాదిగ, దండేపల్లి మండల అధ్యక్షుడు తగరపు సత్యం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆమెపై కొందరు తప్పుడు ఫిర్యాదులు చేశారని, సరైన విచారణ చేయకుండానే ఉన్నతాధికారులు ఆమెను సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు.

ఘనంగా 'ఊరు కట్టడి'



మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్తులు

నెన్నెల: మండల కేంద్రంలో ఆదివారం అన్ని కులాల పెద్దలు, నాయకులు కలిసి ఊరు కట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనినే దోర్నగంబాలు ఎత్తడం అంటారు. ఏటా వర్షాకాలంలో ప్రజలంతా కలిసి డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతలకు మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. దుష్టశక్తులు, విపత్తులు, ప్రకృతి ప్రకోపాల నుంచి కాపాడేందుకు ఊరు కట్టడి చేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

సంత్ తపస్వీ రామారావు మహరాజ్ జయంతి

కాసిపేట: మండలంలోని సోమగూడెం(కె) తండాలో ఆదివారం గురుపూర్ణిమను పురస్కరించుకొని జేఏసీ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు సఫావ్ శంకర్ ఆధ్వర్యంలో సంత్ తపస్వీ రామారావు మహరాజ్ జయంతిని సేవాలాల్ మందిరంలో నిర్వహించారు. క్రీడాప్రాంగణంలో ఐదు వేప, ఒక్క జంబి మొక్కలను నాటారు.

'బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్'

శ్రీరాంపూర్: నాటి బీఆర్ఎస్ బాటలోనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తుందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు కష్టపడి కంపెనీకి లాభాలు తెచ్చిపెడుతుంటే ఈ లాభాల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందన్నారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం పేరుతో సింగరేణి సొమ్మును దోచిపెట్టడానికి ఈ పథకం తయారు చేశారన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి న రూ.29వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు



చెన్నూర్/మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో, చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు.

చిత్తడి రోడ్లతో అరిగోస..!

- చెన్నూర్ మున్సిపాలిటీలో అధ్వానంగా అంతర్గత రోడ్లు
- వర్షాకాలంలో తప్పని తిప్పలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చెన్నూర్ కటికవాడలో బురదమయంగా రోడ్డు

చెన్నూర్: చెన్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యి ఐదేళ్లు కావస్తున్నా, నేటికీ అంతర్గత రోడ్లకు మోక్షం రాలేదు. మున్సిపాలిటీ పరిధిలో పూర్తి స్థాయిలో సిమెంట్ రోడ్లు లేకపోవడంతో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. రోడ్ల నిర్మాణానికి గతేడాది నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగలేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. నలగొండపోచమ్మవాడ, లైన్‌గడ్డ, నడిమిగూడెం, కటికవాడ, పెద్దవాడలలో రోడ్లు లేక బురద రోడ్లతో గోస పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరైనా...

చెన్నూర్ మున్సిపాలిటీలోని మున్సిపల్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి వరకు రూ.5.72కోట్లు, బైరి సత్తెన్న ఇంటి నుంచి జాతీయ రహదారి వరకు రూ.3.60కోట్లు, లైన్‌గడ్డ నుంచి సీతారాం తోట కాలనీ వరకు 1.62కోట్లు, గాంధీ చౌక్ నుంచి మంగళిబజార్ మీదుగా బడా హనుమాన్ వరకు రూ. 2కోట్లు, ఆదర్శనగర్ కాలనీలో రూ.70 లక్షలు, వడ్డెపల్లి జంక్షన్ నుంచి బుద్దారం రోడ్డు వరకు రూ. 1.50కోట్లు, మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో చిన్న చిన్న అంతర్గత రోడ్ల నిర్మాణాలకు రూ.12.36కోట్లు, అస్నాద్ రోడ్డులో డ్రెయినేజీల నిర్మాణానికి రూ.50లక్షలను అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి గత ప్రభుత్వం మే 2023లో టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.28కోట్ల నిధులు మంజూరు చేసింది.

ముందుకు సాగని పనులు...

మున్సిపాలిటీలోని అంతర్గత రోడ్లుకు మంజూరైన నిధులతో పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కొన్ని ప్రాంతాలలో 20శాతం డ్రెయినేజీ పనులు చేశారు. ఎన్నికల ముందు పనులు నిలిచిపోయాయి. మంజూరైన నిధులతో పనులు ప్రారంభిస్తే మున్సిపాలిటీలో 70శాతం ఇంటర్నల్ రోడ్లు పూర్తయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులను పూర్తి చేయించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



బైరి సత్తెన్న ఇంటి నుంచి నలగొండ పోచమ్మ వాడ, ఇందిరానగర్ కాలనీలకు వెళ్లాలంటే మట్టి రోడ్డు కావడంతో వర్షం పడితే రోడ్డు పై నడిచే పరిస్థితి ఉండదు. రాత్రి వేళల్లో బురదలో నానా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డు నిర్మించాలి.

– మనుమల్ల సాయి, ఇందిరానగర్ కాలనీ



రోడ్డు బాగుచేయండి!

కోటపల్లి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎసన్‌వాయి సర్వాయిపేట గ్రామానికి మధ్యలో ప్రధాన రహదారి పూర్తిగా కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డు వెంటే మండలకేంద్రంతోపాటు చెన్నూర్ లాంటి ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొట్టుకుపోయి న రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బురద రోడ్డుపై అవస్థలు..!



బురద రోడ్డును చూపుతున్న కాలనీ ప్రజలు

చెన్నూర్‌రూరల్: ఏళ్లు గడుస్తున్నా కానీ మా పరిస్థితి మాత్రం మారడం లేదని మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలోని పల్లె వాడ ప్రజలు వాపోతున్నారు. కాలనీలో సరైన రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురద రోడ్లపై నడవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మిస్తామని చెప్పి కంకర కుప్పలు పోయించి మళ్లీ కంకర తీసుకువెళ్లారని ప్రజలు వాపోతున్నారు.

గుంతల్లో నీరు నిలిచి..



మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్ సిటీ రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ బురదగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్ల పైన ఉన్న గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు కష్టంగా ఉండగా, పాదాచారులు నడవలేని పరిస్థితి. కాలనీలోని రోడ్లన్నీ బురద గుంతలుగా మారడంతో, రోడ్లను బాగు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



హైటెక్ సిటీలో చిన్న పాటి వర్షానికి రోడ్లపై నిలిచిన నీరు

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: పేద ప్రజలను ఆదుకునేందుకు ఎల్లవేళలా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదలకు విద్య, వైద్యంను ఉచితంగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్‌హాలులో ఆదివారం మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించిన 316మంది లబ్ధిదారులకు రూ.85,01,600విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ బదిలీ ఆపాలని వినతి

మంచిర్యాలటౌన్: లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా తప్పనిసరి బదిలీల కేటగిరీ కింద బదిలీ అవుతున్నారని, ఆయన బదిలీని నిలిపివేసేలా చూడాలని కోరుతూ కళాశాల డిగ్రీ విద్యార్థులు ఆదివారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోనే లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మోడల్ కాలేజీగా తమ ప్రిన్సిపాల్ మార్చారని, ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న తమ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా జైకిషన్ ఓజా సేవలు అవసరమని విద్యార్థులు పేర్కొన్నారు. కళాశాలను అభివృద్ధితో పాటు, సొంత భవనం ఏర్పాటు చేయడం, హాస్టల్ వసతులు ఏర్పాటు చేయడంలో చొరవ చూపారన్నారు. ప్రస్తుతం విద్యార్థులంతా కలిసి తమ ప్రిన్సిపాల్ లక్సెట్టిపేట కాలేజీలోనే కొనసాగించాలని కోరుతున్నామని, తమ అభ్యర్థనను మన్నించి, ప్రిన్సిపాల్ బదిలీని ఆపేలా చూడాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన డీఏవో

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ ఏడాది మే నెలలో మెడికల్ లీవ్‌పై వెళ్లిన జిల్లా వ్యవసాయాధికారి కల్పన తిరిగి విధుల్లో చేరారు. రెండున్నర నెలలపాటు బెల్లంపల్లి ఏడీఏ సురేఖ ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించారు. మళ్లీ కల్పన విధుల్లో చేరడంతో సురేఖ బెల్లంపల్లి ఏడీఏగా కొనసాగుతున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



చెన్నూర్: పూజారిని సన్మానిస్తున్న శిష్యులు



లక్సెట్టిపేట: పూజలు చేస్తున్న భక్తులు



రేండ్లగూడ రామాలయంలో పూజలు

చెన్నూర్: పట్టణంలోని శిరిడి సాయిబాబా, అభయ వీరాంజనేయ ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభయ వీరాంజనేయ ఆలయంలో ఏలేశ్వరం రమేశ్‌చార్యుల దంపతులను శిష్య బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు ఓంకార్‌శర్మ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని ఇటిక్యాల గ్రామంలో గల శ్రీ లక్ష్మీప్రసన్న ఆలయ ప్రాంగణంలో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ నిత్యానంద గొల్లపెల్లి రామలింగయ్య చార్యుల ధ్యాన మందిరంలో గురు రామలింగయ్య చార్యుల పాలరాతి విగ్రహానికి పంచామృత అభిషేకం, పూలు, పండ్లతో అలంకరించారు. పూజల అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు గొల్లపల్లి శ్రీధర్ చార్యులు, రామానంద చార్య స్వామిలకు పాదపూజ చేశారు.

జన్నారం: మండలంలోని వివిధ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని సాయిబాబ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. రేండ్లగూడ రామాలయంలో పురుషోత్తమ చార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, పుష్ప, బిల్వార్చణ నివేదన కార్యక్రమం నిర్వహించారు.

మందమర్రిరూరల్: పట్టణంలో గురుపౌర్ణిమను పురస్కరించుకుని బురుదగూడెం సమీపంలోని అమ్మగుడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గురువు మంతెన సతీష్‌ను పలువురు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. స్థానిక సాయిబాబా ఆలయంలో ఏరియా జీఎం మనోహర్, పలువురు సింగరేణి అధికారులు ప్రత్యేకపూజలో పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సంస్థ సంయుక్త కార్యదర్శి సుగుణాకర్ వ్యాస భగవానుని జన్మదినమే గురుపౌర్ణమి అని ప్రసంగించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు సంతోష్, సుగుణాకర్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఆలయానికి తరలివెళ్తున్న భక్తులు



బోనాలతో వస్తున్న గ్రామస్తులు

నస్పూర్: పట్టణ పరిధిలో ఆదివారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుంచి తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ కాలనీలోని పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లపాపలను సల్లంగ చూడు తల్లీ అని వేడుకున్నారు.

జైపూర్: మండల కేంద్రంలో దళితవాడకు చెందిన ప్రజలు పోచమ్మతల్లికి బోనాలు పోసి మొక్కులు చెల్లించారు. ఏటా ఆషాఢమాసం సందర్భంగా పోచమ్మతల్లి కాలనీవాసులు అంతా బోనాలు పోయడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం కాలనీవాసులు అంతా పిల్లపాపలతో బోనాలతో తరలివచ్చి పోచమ్మతల్లికి బోనాలు పోసి మేకలు బలిచ్చి సల్లంగా చూడు పోచమ్మతల్లి అంటూ మొక్కారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న కలవేణ శంకర్

నస్పూర్: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ డిమాండ్ చేశారు. సీసీసీలోని నర్సయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన మండల సీపీఐ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆగస్టు 4న నర్సయ్య భవన్‌లో నస్పూర్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం, ఆగస్టు 10న జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా నిర్మాణ మహాసభలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, మేకల దాసు, కారుకూరి రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

మైసమ్మ తల్లికి మొక్కులు



రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లాలో కొలువుదీరిన మైసమ్మ తల్లికి ఆదివారం ఆదివాసీలు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో ఖిల్లాపైకి వెళ్లి మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదానం



మంచిర్యాలక్రైం: క్వారీ జాతరను పురస్కరించుకొని ఆదివారం మంచిర్యాల పోలీసులు స్థానిక రైల్వేస్టేషన్‌లో అన్నదానం చేశారు. జాతరకు వెళ్లలేని ఆటో డ్రైవర్లు, అనాథలు, భిక్షాటన చేసుకునే వారి కోసం అన్నదానం చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన



పుష్కరఘాట్ వద్ద వరదలో మునిగిన రోడ్డు



రాచర్ల వద్ద రాకపోకలు నిలిపేస్తున్న పోలీసులు

వేమనపల్లి: ఎగువన కురుస్తున్న వర్షాలకు తోడు పెనుగంగా వార్ధా నదుల నుంచి వరద ఉధృతంగా వస్తుండటంతో ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. గంట గంటకు వరద తీవ్రత పెరుగుతోంది. దిగువన కాళేశ్వరం వద్ద గోదావరిలో వరద తీవ్రత ఉండటంతో ప్రాణహిత నది వరద ముంపు ఎక్కువవుతోంది. వేమనపల్లి మత్తడి వాగు, సుంపుటం ఒర్రే, ముక్కిడిగూడం, బొందచేను ఒర్రే వంతెనల వరకు వరద నీరు పోటెత్తింది. వేమనపల్లి పుష్కర ఘాట్ రోడ్డు పూర్తిగా మునిగిపోగా ముల్కలపేట, రాచర్ల మధ్యలో ఉన్న రోడ్డు వరకు వరద నీరు చేరుకుంది. ప్రాణహిత లోతట్టు ప్రాంతాలైన వేమనపల్లి, జాజులపేట, సుంపుటం, కల్మలపేట, కేతన్‌పల్లి, రాచర్ల శివారులలో సుమారు 500ఎకరాల్లో ఇప్పటికే పత్తి పంట వరదపాలయ్యాయి. నీల్వాయి వాగు చామనపల్లి పెద్దవాగు, బతుకమ్మవాగు, మత్తడి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చామనపల్లి అవతలి వైపు ఉన్న పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఎంచపాయ ఉధృతితో పంట చేళ్లలోకి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ములకలపేట, రాచర్లకు వెళ్లే ప్రధాన రహదారి వద్దకు వరద నీరు పోటెత్తడంతో బొందచేను వంతెన వద్ద అప్రోచ్‌రోడ్డు కుంగింది. దీంతో ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రాచర్ల, వెంచపల్లి, సూపాక, జనగామ గ్రామాలకు రాకపోకలు నిలిపివేసినట్లు ఎస్సై తెలిపారు. రోడ్డు కుంగిన చోట ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు సహకరించి ఈ రోడ్డు మార్గంలో వెళ్లకూడదని కోటపల్లి మండలం వైపు నుంచి రాకపోకలు సాగించాలని సూచించారు.

వర్షానికి కూలిన ఇళ్లు

భీమిని: మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు గంగక్క ఇళ్లు ఆదివారం వర్షానికి నాని నేలకూలింది. నిరుపేదరాలైన గంగక్కను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటోంది.

జైపూర్‌లో...

జైపూర్: మండల కేంద్రంతో పాటు రసూల్‌పల్లి, ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్, ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, శివ్వారం ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు కుండ పోత వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 37మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అత్యవసర సేవల కోసం ప్రత్యేక టీం

మందమర్రిరూరల్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఎదుర్కోవడానికి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అత్యవసర సేవల కోసం ఆదివారం ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ అధికారులుగా శానిటరీ ఇన్స్‌పెక్టర్, హెల్త్ అసిస్టెంట్ సమీర్, ఇంజనీర్ విభాగం నుంచి అసిస్టెంట్ ఇంజనీర్ అచ్యుత్, టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి రాజ్‌కుమార్‌తో పాటు వారి అనుబంధంగా మరి కొందరిని టీంగా నియమించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు వర్షాల వల్ల ఎలాంటి సాయం కావాలన్నా ల్యాండ్ ఫోన్ 08736 293611, టోల్ ఫ్రీ నంబర్ 18004253611కు కాల్ చేసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రకటనలో తెలిపారు.



ఇందారం పెద్ద చెరువులో చేరిన వరద నీరు



చిన్నగుడిపేటలో కూలిన ఇంటి వద్ద గంగక్క



మత్తడి దూకుతున్న నీల్వాయి ప్రాజెక్టు నీరు

సరుకుల పంపిణీ

దండేపల్లి: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన తరాల శంకరవ్వ కుటుంబాని కి దండేపల్లి అమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలలకు స రిపడా బియ్యం, ని త్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చే శారు. పౌండేషన్ అధ్యక్షుడు భానుప్రసాద్ తదితరులు ఉన్నారు.